విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శాలివాహన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూలై 2: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అమడబాకులలో శాలివాహన, గౌడ సంఘం కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. అలాగే అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్, మోడల్ స్కూల్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, విద్యార్థినులు అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివినవారే గొప్ప వారయ్యారని గుర్తు చేశారు. సర్కారు బడుల్లో కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాలెంలోని మారెమ్మ బోనాల పండుగ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కు లు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, వైస్‌ఎంపీపీ శ్రీనివాసు లు, సత్యారెడ్డి, కృష్ణారెడ్డి, రాజు రెడ్డి, రా ము, శ్యాంసుందర్‌గౌడ్, సతీశ్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం

మదనాపురం, జూలై 2: మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.15లక్షలతో నిర్మించిన మండల మహిళా సమాఖ్య భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ప్రాముఖ్యతనిస్తూ వడ్డీ లేని రుణాలను మంజూరు చేశారన్నారు. వాటితోపాటు అనేక పథకాలను మహిళలకు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. అనంతరం మహిళల వినతి మేరకు భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం, మౌలిక వసతులు కల్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియనునండంతో దంతనూరు శివారులోని ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే జీఎమ్మార్ ఎంపీపీ పద్మావతి వెంకట్‌నారాయణ దంపతులు, ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు.

వంగపల్లి దీక్షను విజయవంతం చేద్దాం

అలంపూర్, జూలై 2 : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అంశాన్ని కేంద్రం జాప్యం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి చేస్తున్న దీక్షను విజవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. దీక్షను జయప్రదం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి మాదిగలు అధిక సంఖ్యంలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమదాసు, జయ్యన్న, కిరణ్, లాజర్, వెంకటేశ్, యల్లన్న పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉండవెల్లి, జూలై 2 : మండలంలోని మారమునగాల గ్రామానికి చెందిన సంజన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మిత్రుడి మరణవార్త తెలుసుకున్న 1999–2000 ఏడాదిలో తనతో పాటు పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.61,500లను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివనారాయణ, కానిస్టేబుల్ రవి, బీచుపల్లి, శంకర్, నాసిర్ బాషా, యూసఫ్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

కొత్తకోట, జూలై 2: ఇంటి నిర్మాణానికి బిగించిన గోవ కట్టెలు విరిగి కార్మికుడు మృతిచెందిన ఘటన మంగళవారం పట్టణంలోని విశ్వేశ్వర్ పెట్రోల్ బంక్ ఎదురుగా చోటుచేసుకున్నది. కుటుంబ స భ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సంకిరెడ్డిపల్లికి చెందిన బత్తరి ఆంజనేయులు(48) పట్టణంలోని నంబి సురేశ్ ఇంటి నిర్మాణం నిమిత్తం కూలి పనులకు వెళ్లాడు. మూడో అంతస్తున గోవ కట్టెలు బిగించి వస్తుండగా కట్టెలు విరిగి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య నాగమణి, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

ధరూరు, జూలై 2: మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి మంగళవారం పరామర్శించారు. ఇటీవల వెంటర్‌రెడ్డి కూతురు మృతిచెందగా.. విషయం తెలుసుకున్న బండ్ల జ్యోతి వెంకట్‌రెడ్డి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి, పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు బండ్ల విజయ్‌కుమార్‌రెడ్డి, రంగస్వామి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

వనపర్తి టౌన్, జూలై 2: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను జీహెచ్‌ఎం తారాభాయి మంగళవారం అభినందించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు పాఠశాలకు చెందిన సాయివరుణ్, జీవన్‌సాయి, గు రు రాఘవేంద్ర ఎంపికయ్యారని జీహెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన

వనపర్తి టౌన్, జూలై 2: జిల్లా కేంద్రంలోని సంతబజారు పాఠశాల విద్యార్థులకు మంగళవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి, చెడు స్పర్శ, బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు బాగా చదివి జీవితంలో ఉన్నత అవకాశాలను పొందాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ స్వరూప, జీవిత తదితరులు ఉన్నారు.

అమ్మవారి విగ్రహ నిర్మాణానికి విరాళం

కొత్తకోట, జూలై 2: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ఉన్న దత్త కోటిలింగేశ్వర ఆలయంలో అమ్మవారి విగ్రహ నిర్మాణానికి కర్నూల్ వాస్తవ్యులు భాస్కర్‌రెడ్డి, శిల్పా దంపతులు మంగళవారం రూ.75వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయంలో కార్తీకమాసంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కండక్టర్ శేఖరయ్య, మహేశ్వర్, జగదీశ్, విశ్వనాథం, అర్చకులు అనిల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు కల్పించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

అధికారులతో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూలై 2: అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాట్లపై జిల్లా సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కడెక్కడ మరుగుదొడ్లు, తాగునీటి వసతి అవసరం ఉందో గుర్తించాలని, వాటిలో వేగంగా నిర్మాణాలు ప్రారంభించాలని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి స్పందిస్తూ 154అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, 50 కేంద్రాల్లో తాగునీటి వసతి, 10 కేంద్రాల్లో అప్‌గ్రేడేషన్ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో కొనసాగుతున్న అమ్మ–ఆదర్శ పాఠశాల పనులను వారంలోగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు.

సాధారణ కాన్పులకు ప్రాధాన్యమివ్వాలి..

ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు అధికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యాధికారులకు సూచించారు. పేదవారు ప్రసవాల కోసం ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి వేలకువేలు డబ్బులు వృథా చేసుకుంటున్నారని, తద్వారా వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతింటున్నాయన్నారు. పీహెచ్‌సీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు వారి పరిధిలోని ప్రతిగర్భిణితో మాట్లాడుతూ వారికి ప్రభుత్వ దవాఖానలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ దవాఖానలకు వెళ్లే ప్రతి వందమంది గర్భిణుల్లో 75శాతం సిజేరియన్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ దవాఖానలో 40శాతం మాత్రమే సిజేరియన్ జరుగుతున్నాయన్నారు. సిజేరియేన్ పరిస్థితులను ప్రభుత్వ దవాఖానలో తగ్గించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. ఏఎన్‌సీల సంఖ్య పెంచాలని, ప్రతి గర్భిణికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌సీ నమోదు చేయించి ప్రసవం జరిగే అంచనా తేదీని నమోదు చేయాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ఉండాల్సిన అన్ని రిజిస్టర్లు నిర్ణీత ప్రొఫార్మాల్లో ఉండాలన్నారు. గర్భిణులకు ప్రభుత్వ వైద్యులపై నమ్మకం కల్పించాలని, అందుకు ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే వైద్యసిబ్బంది పీహెచ్‌సీల్లో సమయపాలన పాటించి ఉదయం 9 నుంచి సాయంత్ర 4గంటల వరకు పక్కాగా విధుల్లో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జయచంద్రమోహన్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీబాయి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి అమోఘం

- జెడ్పీ చైర్మన్ లోకనాథరెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి
- చివరి మండల సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

వనపర్తి, జూలై 2: ఐదేండ్ల కాలంలో ప్రభుత్వాలు మారినా మండల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎనలేని కృషి చేశారని జెడ్పీచైర్మన్ లోకనాథరెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిచ్చారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సాధారణ మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులు అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటే వారికి ప్రజా మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వాలు మారినా మండల అభివృద్ధిలో ఉమ్మడి జిల్లాలోనే వనపర్తి మండలం ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వ నిధులు పారదర్శకంగా వినియోగించడంలో ఎంపీపీ కృషి అద్భుతమైందన్నారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో అ ధికారులు మండలంలోని జరుగుతున్న అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. ఇంకా మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీటీసీలు కోరారు. ఈ ఐదేండ్లలో అధికారులు తమకు సహకరించి ప్రజలకు పరిపాలన అందించడంలో తోడ్పాటునందించారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఎంపీపీ కిచ్చారెడ్డితోపాటు ఎంపీటీసీలను శాలువాలు, బొకేలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సువర్ణ, నాగవరం పీఏసీసీఎస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో రాఘవ, ఎంపీటీసీలు రంగారెడ్డి, ధర్మానాయక్, నాగరాజు, ధర్మశాస్త్రి, కో ఆప్షన్ సభ్యుడు శం షోద్దీన్, మండల అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చిన్నంబావి, జూలై 2: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలకతీతంగా గ్రామాలు, మండలాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని, అధికారులు ఒత్తిడికి గురికాకుండా మండలం అభివృద్ధి చెందే విధంగా పనిచేయాలన్నారు. ఎంపీపీ సోమేశ్వరమ్మ మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసమే పనిచేస్తామన్నారు. ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగియనుండడంతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్, ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రావమ్మ, ఎంపీటీసీలను మండల అధికారులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీడీవో రమణారావు, ఎంపీటీసీలు, పుష్పావతి, తగరం లక్ష్మి, మాజీ సర్పంచులు చక్రవర్తి, రామస్వామి, మద్దిలేటి, శివమ్మ, నాయకులు ఉన్నారు.

ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్ లోకనాథరెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి



చిన్నంబావిలో ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, అధికారులు

రేపు రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి

వనపర్తి టౌన్, జూలై 2: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 4న చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నేత లు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘాల ఆధ్వర్యంలో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేత లు మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన అసమర్థ ఎన్‌టీఏ ను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసి, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్‌స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 4న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించాలని, బంద్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, సంఘాల సభ్యులు భరత్, సాయి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుకుందాం

పాన్‌గల్, జూలై 2: బాలలహక్కులు, రక్షణ చట్టాలను కాపాడుకుందామని సోషల్ వర్కర్ నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బాలల హక్కులు, రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్య వివాహ నిషేధచట్టం–2006, బాలికా విద్య ప్రాముఖ్యత, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 112, 100 అంశాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో ఈ చట్టాలు బాలబాలికలకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ఒకరికి గాయాలు

అయిజ రూరల్ , జూలై 2 : ఆటో బోల్తాపడి వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సతీశ్ అయిజ చిన్న తాండ్రపాడు గ్రామాల మధ్య ఆటోను నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మంగళవారం అయిజ నుంచి గ్రామానికి వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గోతులను తప్పించి పోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు దవాఖానకు తరలించారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

మల్దకల్, జూలై 2: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతునేస్తంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు సమీకృత వ్యవసాయంపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్‌లో అవగాహన కల్పించారు. ఏవో రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీసీలో విత్తన ఎంపికపై డా.గోవర్ధన్ అవగాహన కల్పించారు. సమీకృత వ్యవసాయం, వెదజల్లే పద్ధతి గురించి రైతు మల్లికార్జున్ తన అనుభవాన్ని వివరించారు. శాస్త్రవేత్తతో ముఖాముఖి కార్యక్రమంలో రైతులు తమకు అవసరమైన వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఏడీఏ సంగీత లక్ష్మి, గద్వాల డివిజన్ అధికారులు, ఏఈవోలు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులదే ముఖ్యపాత్ర

సన్మానం పొందిన జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, జెడ్పీటీసీలతో కలెక్టర్ సంతోష్

కేటీదొడ్డి మండల ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్

గద్వాల రూరల్, జూలై 2: జిల్లా అభివృద్ధి, ప్రగతిని పెంచడంలో ప్రజాప్రతినిధులు చూపిన చొరవనే ముఖ్య భూమిక పోషించిందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ కార్యాయలంలో జెడ్పీటీసీలు, ప్రభుత్వాధికారులను ఆమె ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి సహకారం అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. ప్రజాజీవితంలో పదవులు తాత్కాలికమైనప్పటికీ ప్రజలకు మీరందించిన ప్రగతే మిమ్మల్ని శాశ్వతమైన నాయకులుగా నిలబెడుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, సీఈవో కాంతమ్మ, కో ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ప్రతి ఎంపీటీసీకి రుణపడి ఉంటా..

కేటీదొడ్డి, జూలై 2: స్థానిక పరిపాలనలో ఎంపీటీసీలు పాత్ర పోషించి పల్లెలను ప్రగతి వైపు నడిపించినందుకు ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటానని ఎంపీపీ మనోరమ అన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ పదవీ కాలం ముగుస్తుండడంతో ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజశేఖర్‌తోపాటు ఎంపీటీసీలను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లెప్రగతిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యమయ్యేలా చేసి ప్రజల్లో ఎంపీటీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. అలాగే జెడ్పీటీసీ మాట్లాడుతూ.. పల్లె ప్రగతి కార్యక్రమాలతో కేసీఆర్ మనల్ని ప్రజల్లో చిరస్మరణీయమైన నేత

పాన్‌గల్‌లో ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

కొత్తకోట వైస్ ఎంపీపీని సన్మానిస్తున్న వడ్డెర సంఘం నేతలు

లుగా ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చక్రధర్‌రావు, రఘుకుమార్‌శెట్టి పాల్గొన్నారు.

ప్రజాసేవ మరువలేనిది..

పాన్‌గల్, జూలై 2: ప్రజాసేవ మరువలేనిదని, ప్రజలకు సేవచేయడంతో ఆత్మసంతృప్తి కలుగుతుందని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఇచ్చిన సహకారంతో గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వర్, డీటీ అశోక్‌కుమార్, ఎంపీవో రఘురాములు, ఎంపీటీసీలు, అధికారులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి సన్మానం

కొత్తకోట, జూలై 2: వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు పదవీ కాలం ముగియనుండడంతో మంగళవారం వడ్డెర సంఘం నేతలు శాలువా, పూలమాలతో సన్మానించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వడ్డెర సంఘాల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో నిధులు తెచ్చారని సంఘం నేతలు కొనియాడారు. కార్యక్రమంలో కొండన్న, నాగరాజు, రాములు, చెన్నయ్య, బాలన్న, ఆంజనేయులు, రాజు, రాములు, శివకృష్ణ, కృష్ణయ్య, నాగన్న పాల్గొన్నారు.

అయిజ సబ్‌మార్కెట్‌ను అప్‌గ్రేడ్ చేయాలి

అయిజ, జూలై 2 : మూడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండి ఎంతో మంది రైతులు, వ్యాపారులకు అనువుగా ఉన్న అయిజ పట్టణంలోని సబ్ మార్కెట్‌ను అప్‌గ్రేడ్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సబ్ మార్కెట్ యార్డును ఆయన పరిశీలించారు. మార్కెట్‌కు ఏడాదికి ఆదాయం లక్షల్లో సమకూరుతున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమవుతున్నారని విమర్శించారు. సంతలో జరుగుతున్న వ్యాపారానికి మార్కెట్ ఫీజు రూపంలో వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సంతకు వచ్చిన పశువులకు తాగునీటి సౌకర్యం లేకపోవడం దురదృష్టకరమన్నారు. మార్కెట్‌లోని ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, మార్కెట్‌లో ముళ్ల పొదలు ఏపుగా పెరిగి సంతకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహయ్యశెట్టి, గోపాలకృష్ణ, భగత్‌రెడ్డి, భీమ్‌సేన్‌రావు, వెంకటేశ్, వీరేశ్, వెంకటేశ్ యాదవ్, వీరేశ్ గౌడ్, లక్ష్మణాచారి, అశోక్, రామకృష్ణ, భీమన్న పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

గద్వాలటౌన్, జూలై 2: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 4న జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న మంగళవారం ప్రకటనలో తెలిపారు. 8, 10,12 సంవత్సరాల బాలుర, బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7013168 158 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్వ్యూలు వాయిదా

గద్వాల టౌన్, జూలై 2: ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుల ఎంపిక కోసం ఈనెల 3న నిర్వహించే ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీని దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా తెలుపనున్నట్లు పేర్కొన్నారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, జూలై 2 : శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 3వ తేదీన నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. గద్వాల ఎంఎఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ ఖలందర్ బాషా ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి తేదీని అభ్యర్థులకు ఫోన్ ద్వారా తెలియజేస్తామన్నారు.

రెగ్యులర్ అధికారిని నియమించాలి

పెబ్బేరు, జూలై 2: పెబ్బేరులోని మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో రెగ్యులర్ అధికారి లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక